క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పరవాడ: మండలంలోని ఈ.బోనంగి శివారు బొద్దపువానిపాలెం గ్రామంలో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని గ్రామ ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామిని గ్రామ పెద్దలు బండారు అప్పలనాయుడు, సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, అట్టా సన్యాసప్పారావు, మేడిశెట్టి బాలాజీనాయుడు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పరిసర గ్రామాల భక్తులు ప్రసాదం స్వీకరించారు.

అలరించిన భక్తి విభావరి



కీర్తనలు ఆలపిస్తున్న గాయనిలు సుజని, రాణి

సింహాచలం: పాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని సింహగిరిపై అన్నమాచార్య సంకీర్తన మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ రాజగోపురం సమీపంలోని కళావేదికపై సాయంత్రం 5గంటల వరకు జరిగిన కార్యక్రమంలో నగరానికి చెందిన గాయనిలు బి.సుజని, రాణి అన్నమాచార్య కీర్తలు ఆలపించారు. మృదంగంపై చైతన్య సహకరించారు. దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్, దేవస్థానం విశిష్ట దాత సాయి, సూపరింటెండెంట్ కనకరాజు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అవగాహన

సింహాచలం: నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఐ అవేర్నెస్ డ్రైవ్ నిర్వహించారు. సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కంటి సమస్యలను శంకర్ ఫౌండేషన్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. అధికంగా మొబైల్ ఫోన్స్ ఉపయోగించడం, టెలివిజన్‌తో ఎక్కువ సమయం గడపడం వల్ల కళ్లు ఒత్తిడికి లోనై అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. కంటి సమస్యలను ఎలా అధిగమించాలన్న అన్న అంశంపై సూచనలు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.స్వరూప చంద్రకళ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ

విశాఖ విద్య: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్లకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)లో భాగంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో శిక్షణ నిర్వహించారు. మంగళవారం సైన్స్, హిందీ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. వృత్తి నైపుణ్య శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంవో ఎ. శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజులు పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు విజయవంతమయ్యాయన్నారు.

13 నుంచి పన్ను చెల్లించని వాహన తనిఖీలు

గోపాలపట్నం: జిల్లా వ్యాప్తంగా పన్నులు చెల్లించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఫోన్ల ద్వారా వాహన యజమానులకు సమాచారమిచ్చామని, ఈ నెల 11లోగా పన్నులు చెల్లించాలన్నారు. ఈనెల 13 నుంచి తనిఖీలు చేపడతామన్నారు. స్క్రాప్ అయిన వాహనాలకు వెంటనే పన్ను చెల్లించి రిజిస్ట్రేషన్ రద్దు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా మహిళా దినోత్సవం


పురుషోత్తపురం ఎంపీపీ స్కూల్లో సత్కారం పొందిన్న ఉపాధ్యాయులు


పెందుర్తి గ్రంథాలయంలో మాట్లాడుతున్న మహిళావక్తలు


శారదాదేవిని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

పుట్టింట్లో తండ్రి చాటు బిడ్డగా.. మెట్టినింట్లో భర్త విజయంలో వెన్నుదన్నుగా.. బిడ్డల్ని సాకే తల్లిగా పరిమితమైన ఆమె.. నేడు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. రంగం ఏదైనా.. అవకాశాలు ఏవైనా ఆమె లేనిదే ఏదీ లేదు. గ్రామాల్లో విత్తునాటి వ్యవసాయానికి దన్నుగా.. దేశ సరిహద్దులో కంటికి రెప్పలా కాచే సైనికురాలిగా తనకు అసాధ్యమన్నదే లేదని చాటిచెప్తోంది. మేధాశక్తితో వ్యాపార సామ్రాజ్యాలను కనుసన్నల్లో నడపడంతోపాటు, రాజకీయ యవనికపై సైతం తనకు సాటెవరూ లేరన్న రీతిన సాగిపోతోంది. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల విజయగాథ.

సింహాచలం/సబ్బవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పెందుర్తి ,సబ్బవరం మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పురుషోత్తపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులతో పాటు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ , సచివాలయ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథకం సిబ్బందిని పాఠశాల యాజమాన్య కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పెందుర్తి గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మత్తల శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు నేడు అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నారన్నారు. మదర్ థెరిసాకులమతాలకు అతీతంగా మానవ సేవ చేశారని కొనియాడారు. పెందుర్తి సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ వి.షణ్ముఖి మాట్లాడుతూ గృహం స్వర్గసీమగా ఉండాలంటే స్త్రీ ఉన్నత పాత్రను పోషించాలన్నారు. ఉపాధ్యాయురాలు ఉమారాణి, గ్రంథాలయాధికారిణి సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరం డిగ్రీ కళాశాలలో..

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారిక విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ట్స్ ఆఫ్ లివింగ్ ట్రినర్ పి. శారదాదేవి ప్రసంగించారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి యోగాసనాలు,ధ్యానం అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. సీతాలక్ష్మి మాట్లాడుతూ సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో మహిళలు మరింత సాధికారత సాధించాలని ఆకాంక్షించారు. అతిథి శారదాదేవిని సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ బి. శంకర్, అధ్యాపకురాలు బి. లక్ష్మి పాల్గొన్నారు.

తండ్రి ఆశయ సాధనకు..



జాగృతి సొసైటీ స్థాపించిన కందర్ప రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం కుంగిపోయింది. దీంతో బీటెక్ పూర్తి చేసిన కందర్ప మౌక్తిక తండ్రి ,ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని జాగృతి సొసైటీ సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది.గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ చేతులమీదగా అవార్డు అందుకున్నారు. – కందర్ప మౌక్తిక, జాగృతి సంస్థ సీఈవో

మహిళలకు విస్తృత అవకాశాలు



కష్టించి పనిచేసేవారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుంది. ప్రస్తుతం సమాజంలో అన్నిరంగాల్లో మహిళలు ముందువరసలో ఉంటున్నారు. దీనికి తోడు కుటుంబ ఆదరణ,ప్రభుత్వ ప్రోత్సాహంతో అత్యున్నత కొలువులతో పాటు పదవుల్లో మహిళలు రాణిస్తున్నారు. అత్యున్నత స్థానాల్లో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకుని మహిళా లోకం మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నాను.
– బోకం సూర్యకుమారి, ఎంపీపీ, సబ్బవరం

అన్నింటా అతివలు



మహిళలు అన్నిరంగాల్లో ప్రాతినిధ్యం వహించి ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం కొంతమంది మహిళలు ఉన్నత చదువుతో పాటు స్థిరపడిన తర్వాతే వివాహాలు చేసుకుని స్థిరపడుతున్నారు. వారి బాటలోనే మిగిలిన మహిళలంతా ముందుకు సాగాలి. వీరి సేవలు దేశానికి ఎంతో అవసరం.అన్ని రంగాల్లో మహిళలు రాణించడం ఆహ్వానించదగిన విషయం. మరింత ప్రోత్సాహం అందించాలి.
– బి. సీతాలక్ష్మి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సబ్బవరం

‘వేదిక’పై వేడుక

- మూడు రోజుల్లో 400 ప్రదర్శనలు
- జీ–20 సదస్సు జరిగే వరకు వీకెండ్‌లో మాత్రమే ప్రదర్శన



పాట పాడుతున్న దివ్యాంగుడు


డ్యాన్స్‌చేస్తున్న బాలిక

బీచ్‌రోడ్డు : నగరవాసులు తమ ప్రతిభను చాటుకునేందుకు జీవీఎంసీ ఆధ్వర్యంలో ‘వేదిక’ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆర్కే బీచ్ వేదికగా తమ టాలెంట్‌ను ప్రదర్శించే అవకాశం కల్పించింది. జీ–20 సదస్సు నేపథ్యంలో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ చేపట్టింది. మూడు రోజులుగా జరిగిన వైజాగ్ టాలెంట్ హంట్‌కు విశేష స్పందన లభించింది. 400లకుపైగా ప్రదర్శనలు జరిగాయి. ముగింపు రోజైన మంగళవారం దివ్యాంగులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫ్లూట్, గిటార్ వంటి వాయిద్యాలు, పాటలు పాడుతూ ప్రతిభ చాటుకున్నారు.

ఇకపై ప్రతీ శని,ఆదివారాల్లో వేదిక

జీ–20 సదస్సు జరిగే వరకు ప్రతీ శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం ఆర్కేబీచ్ వద్ద నిర్వహించనున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసినాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను నమోదు చేసుకొని ప్రదర్శన ఇవ్వవచ్చన్నారు.

అయ్యప్పనగర్‌లో చోరీ

- ఆరుతులాల బంగారు ఆభరణాల అపహరణ

సింహాచలం:పెందుర్తి మండలం అయ్యప్పనగర్‌లో మంగళవారం చోరీ జరిగింది. పెందుర్తి నుంచి ఆనందపురం మార్గంలో ఉన్న అయ్యప్పనగర్‌లో వరద సన్యాసిరావు దంపతులు నివాసం ఉంటున్నారు. పెందుర్తి రాతిచెరువు ప్రాంతంలో వీరు టిఫిన్ దుకాణం నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం దుకాణానికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వస్తుంటారు. ఈ తరుణంలోనే మంగళవారం ఉదయం కూడా ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలోని ఆరు తులాల బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయి. దీంతో పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సల్మాన్ బేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డానిడా ఫెలోషిప్‌కు అనింధ్యా రాయ్ ఎంపిక


అనింధ్యా రాయ్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్‌లో రీసెర్చ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ అనింధ్యా రాయ్ చౌదరి ప్రతిష్టాత్మకమైన డానిడా ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో చౌదరిని అభినందించారు. ఈ నెల 13 నుంచి 31 వరకు డెన్మార్క్‌లోని కోపెన్‌హగన్ బిజినెస్ స్కూల్‌లో జరిగే మేధోసంపత్తి హక్కులు–ఆవిష్కరణ, వాణిజ్యీకరణ పెంపొందించడం’అంశంపై నిర్వహించే కోర్సులో అనింధ్యా పాల్గొననున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, డెన్మార్క్ ప్రభుత్వం సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో భారత్ నుంచి 15 మంది, బ్రెజిల్ నుంచి 15 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ, పరిశ్రమల సందర్శన ఉంటాయి. డాక్టర్ అనింధ్యా రాయ్ చౌదరి హార్వర్డ్ లా స్కూల్ అందించే పేటెంట్ ఎక్స్ కోర్సులో పాల్గొనడానికి యునైటెడ్ నేషన్స్ స్పెషల్ ఏజెన్సీ నుంచి స్కాలర్‌షిప్‌ను సైతం సాధించారు. ఈ సందర్భంగా అనింధ్యాని ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు అభినందించారు.

స్త్రీశక్తి ప్రాధాన్యతను గుర్తెరగాలి


ఆచార్యులను సత్కరిస్తున్న ఆచార్య లక్ష్మీప్రసాద్

ఏయూ క్యాంపస్: స్త్రీశక్తి ప్రాధాన్యతను గుర్తెరిగి ప్రతి వ్యక్తి నడుచుకోవాలని అధికార భాషా సంఘం పూర్వ చైర్మన్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ మహిళా ఆచార్యులు రాజమాణిక్యం, జె.విజయభారతి, డాక్టర్ వెంకట లక్ష్మి, డాక్టర్ సరోజినిలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీమూర్తి ఔన్నత్యాన్ని, సహనాన్ని వివరించారు. జీవితంలో మనకు తోడుగా ఉంటూ విభిన్న అనుబంధాలను అందించే మహోన్నత వ్యక్తిగా స్త్రీమూర్తి నిలుస్తారన్నారు. హిందీ విభాగాధిపతి ఆచార్య ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాలలో ప్రగతి చూపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మెడికో ప్రీతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ముగిసిన రీజినల్ క్విజ్ పోటీలు


పోటీలకు హాజరైన విద్యార్థులతో రెక్టార్ ఆచార్య సమత

ఏయూ క్యాంపస్: ఉన్నత విద్యా మండలి నిర్వహించిన రీజినల్ క్విజ్ పోటీలు మంగళవారం ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు 31 బృందాల నుంచి 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు రౌండ్లలో జరిగిన పోటీలలో పాయకరావుపేట స్పేసెస్ డిగ్రీ కళాశాల, విజయనగరం ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సీతం ఇంజినీరింగ్ కళాశాల, శ్రీకాకుళం ఐఐఐటీ విద్యార్థులు 8 మంది విజేతలుగా నిలిచారు. వీరంతా ఈ నెల 18 నుంచి విజయవాడలో ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగే సెమీఫైనల్ పోటీలకు హాజరు కానున్నారు. మూడు రీజియన్లుగా జరుగుతున్న ఈ పోటీలలో మొత్తం 12 బృందాలను ఎంపిక చేసి సెమీఫైనల్స్ నిర్వహిస్తారు. క్విజ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

జోరుగా ప్రచారం


ఓటర్లకు బ్యాలెట్ నమూనా చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల సచివాలయాల కన్వీనర్ వెన్నల సన్యాసిరావు కోరారు. సుధాకర్‌కు మద్దతుగా మంగళవారం పెదముషిడివాడలో పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లా నాగమణి, పల్లా అప్పారావు(కబడ్డీ), పార్టీ నాయకులు కలవలపల్లి సత్యనారాయణ, సుందరపు శ్రీను, అలమండ నారాయణరావు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం

సింహాచలం: ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులంతా తొలి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు విజ్ఞప్తి చేశారు. వార్డు పరిధిలోని పలు కాలనీల్లో మంగళవారం ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ బల్ల రాంబాబు, అడ్వకేట్ మామిడి రాజు, పార్టీ నాయకులు సూరిశెట్టి సూరిబాబు, లంకి శ్రీను, బోడెం రామారావు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక వైద్యం

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


నరవ పట్టణ ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భిణులకు కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు సూచనలు అందజేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు.పెందుర్తి మండలం నరవ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ప్రయాణ సదుపాయం కల్పించాలని,ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మందుల విభాగాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్స్ తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్టుల సేవల పట్టిక ప్రజలకు తెలిసేలా బోర్డు పెట్టాలని ఆదేశించారు. ఇ–సంజీవని కాల్స్ రోజుకు 20కి తక్కువ కాకుండా చూడాలని తెలియజేశారు. అనంతరం పెందుర్తి మండలం గొరపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఏ విధంగా జరుగుతోందో సమీక్ష చేసి పలు సూచనలు చేశారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ ఎన్.రమారెడ్డి,బి.నాగభూషణం,ఆరోగ్య సిబ్బంది,ఆశ వర్కర్లు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ థీమ్ పార్కు పనుల పరిశీలన


శ్లాబ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు రత్నగిరి నగర్‌కాలనీలో రూ.1 94 కోట్లతో చేపట్టిన స్పోర్ట్స్ థీమ్ పార్కులో చేపడుతున్న పనులను మంగళవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. ఆయా పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. క్రమ పద్ధతిలో పనులు చేసి వాటరింగ్ ఎక్కువగా చేయాలని సూచించారు. ఎలాంటి అశ్రద్ధ కనబరిచినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల గుణాకర్, బొడ్డు దేముడుబాబు, కొత్తపల్లి అప్పలరాజు, కుంచా భార్గవ్ పాల్గొన్నారు.

గాయని సుశీలకు స్వాగతం


సుశీలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మద్దిలపాలెం : మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం కళాభారతిలో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాయని సుశీల హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె విశాఖ చేరుకున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో సుశీలకు యాక్మీ ప్రతినిధి ప్రతాప్, వండర్ కిడ్స్ స్కూల్ అధినేతలు రాముడు నాయుడు దంపతులు స్వాగతం పలికారు.

వైభవంగా గ్రామదేవతల పండగలు


ముత్యమాంబను దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు


అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళుతున్న భక్తులు


పరదేశిమాంబను దర్శించుకున్న పరవాడ జెడ్పీటీసీ రాజు తదితరులు

పరవాడ: మండలంలోని నాలుగు గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవతల పండగలను వైభవంగా నిర్వహించారు. దీంతో ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది.భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పరవాడలో పైడిమాంబ, నాయుడుపాలెం ముత్యమాంబ, తానాం పరదేశిమాంబ, దేశపాత్రునిపాలెంలో పోలమాంబ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరవాడ పైడిమాంబ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దంపతులు కూడా దర్శించుకున్నారు. భారీ బాణ సంచాకాల్పుల మధ్య అమ్మవారి అనుపు మహోత్సవాన్ని నిర్వహించారు.

- ముత్యమాంబ పండగను నాయుడుపాలెం, వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివెళ్లారు. నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, ఆలయ కమిటీ చైర్మన్ కె.కృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ కె.సన్యాసినాయుడు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.
- తానాం పరదేశిమాంబ అమ్మవారిని పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు దంపతులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పండగను పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు సర్పంచ్ కన్నూరు దేవి నగదు బహుమతులు అందజేశారు.
- దేశపాత్రునిపాలెం పోలమాంబ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. బాణ సంచాకాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. సీఐ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు పండగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా చర్యలు తీసుకున్నారు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వలన కిరండూల్‌లో లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీలలో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. కిరండూల్‌లో బుధవారం బయల్దేరవలసిన కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుండి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖ బుధవారం బయల్దేరే విశాఖ– కిరండూల్ (08551) దంతేవాడ వరకు.. కిరండూల్‌లో బుధ,గురువారాల్లో బయల్దేరవలసిన రైలు ఆయా తేదీలలో దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటాయి.

జాతీయ రహదారిపై కారు బోల్తా


బోల్తా కొట్టిన కారు

ఎంవీపీ కాలనీ: సత్యం జంక్షన్ సమీపంలో ఓ కారు ఒక వ్యక్తిని ఢీకొని జాతీయ రహదారిపై బోల్తా కొట్టిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన బోర శ్రీను(32) మంగళవారం తెల్లవారుజామున ఎన్‌ఏడీ వైపు నుంచి ఆరిలోవ వైపు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నారు. సత్యం కూడలి సమీప జయభేరి షోరూం ఎదురుగా వచ్చేసరికి అతివేగం కారణంగా వై.దాలినాయుడు అనే వ్యక్తిని ఢీకొట్టడంతో పాటు చెట్టును గుద్దుకోవడంతో ఒక్కసారిగా కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. స్థానికులు స్పందించి కారులోని వ్యక్తిని బయటకు తీసి, 108కి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో గాయపడిన దాలినాయుడిని చికిత్స నిమిత్తం ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం దాలినాయుడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.